సాక్షి
బాపట్ల
బుధవారం । 29 । మార్చి । 2023



గురుకులంలో బడి నిద్ర

సత్తెనపల్లి: మండలంలోని రామకృష్ణాపురం బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో తహసీల్దార్ కె.నగేష్ నేతృత్వంలో మంగళవారం రాత్రి బడి నిద్ర చేపట్టారు.



నిమ్మకాయల ధరలు

తెనాలి టౌన్: స్థానిక మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.6,000, మోడల్ ధర రూ.5,000 వరకు పలికింది.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
బాపట్ల	6:25	4:48
గుంటూరు	6:25	4:48
నరసరావుపేట	6:27	4:46

ప్రజల జీవన స్థాయి పెరగాలి

- అధికారులు, ఉద్యోగులు ఆత్మసంతృప్తి కలిగేలా పనితీరు ఉండాలి
- ప్రభుత్వ ఆలోచనలు, నిర్ణయాల మేరకు యంత్రాంగం పనిచేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్, చిత్రంలో కలెక్టర్లు దినేష్‌కుమార్, విజయకృష్ణన్, ఎస్పీ మలికాగర్గ్, జేసీ శ్రీనివాసులు

ఒంగోలుఅర్బన్: ప్రజల జీవన స్థాయి మెరుగుపడేలా అధికార యంత్రాంగం, ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా శాఖ కార్యదర్శి జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జీజీహెచ్ ఆడిటోరియంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధ్యక్షతన ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సంబంధించి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన (ఎస్‌డీజీ), స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల అమలుపై వర్క్‌షాప్, సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రకాశం జిల్లా కలెక్టర్‌తో పాటు బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ప్రకాశం ఎస్పీ మలికాగర్గ్ రెండు జిల్లాల జాయింట్ కలెక్టర్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు ఎస్‌డీజీ, స్పందన కార్యక్రమాల అమలు చేస్తున్న తీరును వివరించారు. ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల సమస్యలు పరిష్కరించినా, చిత్తశుద్ధితో విధులు నిర్వహించినా పేద, బడుగు వర్గాల ప్రజల జీవితాలపై ఎంతో ప్రభావం చూపుతుందన్నారు. యంత్రాంగం చేసే పనుల వలన ప్రజలకు మేలు జరిగితే వాళ్లు పేదరికం నుంచి బయటపడతారన్నారు. తద్వారా చేసిన ఉద్యోగులకు ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. ప్రజల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ 'స్పందన' పేరును నిర్ధారించారని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం పనితీరుకు 'స్పందన' అద్దం పట్టేలా పనిచేయాలన్నారు. జిల్లాల్లో ఎస్ఎల్‌పి లోపు అర్జీలను పరిష్కరిస్తున్న తీరును ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ ఆలోచనలు, నిర్ణయాల మేరకు అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు. వర్క్‌షాప్ తర్వాత యంత్రాంగం చేసే పనితీరులో మార్పు వచ్చి పేద ప్రజల జీవన స్థాయి మెరుగుపడుతుందని ఆశిస్తున్నానన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పట్ల ప్రతి ఉద్యోగి అవగాహనతో వాటిని సాధించే దిశగా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ధనిక, పేదల మధ్య తీవ్రస్థాయిలో ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ఐక్యరాజ్య సమితి 2015లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ఏర్పరచిందన్నారు. పేదరికం, ఆకలి నివారించి ఆరోగ్యం, నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన తాగునీరు అందించడం వంటి 17 లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. ప్రభుత్వ రూపొందించిన పథకాలు, కార్యక్రమాల ద్వారా ఈ లక్ష్యాలను సాధించేలా ప్రతి ఉద్యోగి పనిచేయాలన్నారు.

అభివృద్ధి దిశగా సూచనలు

కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి దిశగా చేసిన సూచనలను అధికార యంత్రాంగం అమలు చేసేలా చూస్తామన్నారు. స్పందన సమస్యల పరిష్కారంలోను నాణ్యత ఉండేలా మరింత కృషి చేస్తామని చెప్పారు. ఎస్‌డీజీ సాధనపై ప్రత్యేక దృష్టితో చర్యలు తీసుకుని పేదరిక నిర్మూలన, బాలికలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు.

ప్రజా ఫిర్యాదులను సొంత సమస్యలుగా భావించాలి

బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను సొంత సమస్యలుగా భావించి అధికారులు, ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించినప్పుడే అటు అర్జీదారులకు, ఇటు యంత్రాంగానికి ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. ఎస్‌డీజీ లక్ష్యాల సాధనకు ప్రత్యేక ప్రాధాన్యతతో పనిచేస్తామన్నారు.

అవగాహన పెంచుకుని పనిచేయాలి

ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ ఎస్‌డీజీ, స్పందన అంశాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యంపై ఉద్యోగులు అవగాహన పెంచుకుని పనిచేయాలన్నారు. సిబ్బందిలో జవాబుదారీతనం ఉండాలన్నారు. ప్రతి అర్జీని ప్రాధాన్యతగా తీసుకుని ప్రజలకు సేవలందించాలన్నారు. పాఠశాల విద్యా కమిషనర్ విజయదుర్గ, మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కో ఆర్డినేటర్ సునీత, పురపాలక శాఖ అదనపు డైరెక్టర్ రవీంద్రబాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ భాస్కరరావు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్ బాబు, సచివాలయాల ప్రాజెక్టు లీడర్ అశోక్, ఆర్‌టీజీఎస్ ప్రతినిధి సృజన్, బాపట్ల ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ శిక్షకులు శ్రీనివాసరావులు ఆయా రంగాల్లో ప్రగతిని తెలిపారు. బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, బాపట్ల డీఆర్ఓ లక్ష్మీశివజ్యోతి, ప్రకాశం డీఆర్ఓ ఆర్ శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, సీపీవో వెంకటేశ్వర్లు, స్పందన సూపరింటెండెంట్ నాగజ్యోతి పాల్గొన్నారు.



అనుగ్రహ భాషణచేస్తున్న సిద్దేశ్వరానంద భారతీస్వామి, వేదికపై పలువురు స్వాములు

అమ్మ మహిమలు అనంతం


- సిద్ధేశ్వరపీఠం పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతీస్వామి
- జిల్లెలమూడి అమ్మ శత జయంత్యుత్సవాలు ప్రారంభం

బాపట్లఅర్బన్ : విశ్వజనని జిల్లెలమూడి అమ్మ శత జయంతోత్సవ ప్రారంభ సభ శ్రీ విశ్వజనని పరిషత్ ట్రస్ట్ నిర్వహణలో మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. జిల్లెలమూడి తనయులు బ్రహ్మాండం రవీంద్రరావు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా పనిచేసిన ఎల్.వి.బి.సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లెలమూడి అమ్మ అందరికీ మార్గనిర్దేశం చేస్తూ సంకల్పాన్ని, ధైర్యాన్ని ప్రసాదించారన్నారు. ముఖ్య అతిథి సిద్ధేశ్వర పీఠం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి అనుగ్రహ భాషణ చేస్తూ అమ్మ వల్లే జిల్లెలమూడికి పేరు వచ్చిందన్నారు. ప్రేమ భావనతో నూతన సమాజాన్ని నిర్మించిన మహా మహిమాన్విత శక్తి స్వరూపిణి అన్నారు. పి.అనురాధ మాట్లాడుతూ అమ్మ అనుగ్రహం చిన్న వయసులో పొందటం తన అదృష్టమన్నారు. ఆధ్యాత్మిక శాస్త్రవేత్త వి.ఎస్.ఆర్ మూర్తి సంపాదకత్వంలో వెలువడిన శతజయంతి విశిష్ట సంచిక 'శారద వైజయంతి'ని తిరుపతి శ్రీ శక్తిపీఠం పీఠాదేశ్వరి రమ్యానంద భారతిస్వామి ఆవిష్కరించారు. విశ్వజననీ మాసపత్రిక మార్చి, ఏప్రిల్ ప్రత్యేక సంచికను కాకతీయ సిమెంట్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ పి.అనురాధ ఆవిష్కరించారు. దర్శనం మాసపత్రిక సంపాదకులు ఎం.వి.ఆర్.శర్మ మాట్లాడుతూ అమ్మ సంకల్పంతో 'దర్శనం' మాసపత్రిక ప్రారంభించామన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థినీ విద్యార్థులు పాటలు, పద్యాలతో అమ్మ వైభవాన్ని కీర్తించారు. తాడేపల్లిగూడెంకు చెందిన ముదపాక బాలసుందరం భాగవతార్ బృందం, తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్ట్ నుంచి ప్రముఖ విద్వాన్సులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ బృందం నిర్వహించిన స్వర సుమాంజలి భక్తులను ఆనందింప చేశారు. కార్యక్రమంలో కామరాజు, యల్లాప్రగడ శ్రీమన్నారాయణ, రమణ కేంద్రం నిర్వాహకులు సద్గురు శివానందమూర్తి, శక్తిపీఠం పీఠాదేశ్వరి శ్రీ రమ్యానంద భారతి, కొమ్ముమూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు హరియాణా గవర్నర్ రాక

హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ బాపట్ల జిల్లాకు బుధవారం రానున్నారు. విశ్వజన పరిషత్ ట్రస్ట్ అమ్మ దేవస్థానం శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం మంగళవారం 530.90 అడుగుల వద్ద ఉంది. ఇది 169.9082 టీఎంసీలకు సమానం. కుడి కాలువకి 6,465 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

జుమ్మా మసీదు @150

అప్పట్లో గుంటూరు తర్వాత భట్టిప్రోలులోనే మసీదు



భట్టిప్రోలు: భట్టిప్రోలు ప్రధాన రహదారిలోని జుమ్మా మసీదుకు 150 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో జమాలుద్దీన్ ఈ మసీదును నిర్మించారు. ఆ కాలంలో జిల్లాలో గుంటూరు తర్వాత భట్టిప్రోలులోనే మసీదు ఉండేది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ముస్లింలు నమాజు చేసుకునేందుకు ఇక్కడకు గుర్రాలపై వచ్చేవారని పెద్దలు చెబుతుంటారు. నమాజుకు వచ్చిన వారికి భోజన వసతి కూడా ఏర్పాటు చేసేవారని చెబుతున్నారు. జుమ్మా మసీదుకు ఎదురుగా ఉన్న గదులు ప్రార్థన చేసేందుకు వచ్చేవారు విశ్రాంతి తీసుకునేందుకు ఉపయోగించేవారు. గుర్రాలు నిలుపుదల చేసేందుకు ఈ భవనం కిందగా దారి ఉండేది. ఇప్పుడు అక్కడ దుకాణాలు వెలిశాయి. ఈ మసీదు ఏర్పడ్డాకే జిల్లాలోని అన్ని ప్రాంతాలలో మసీదులు ఏర్పాటు చేసినట్లు చెబుతారు. అప్పటి నుంచి ఐదు పూటలా నమాజులు, ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. రంజాన్ మాసంలో ఉపవాసాలతో పాటు తరాబే నమాజులు జరుగుతాయి.

ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. జూనియర్ అసిస్టెంట్(2), జూనియర్ స్టెనో(1), టైపిస్ట్(3), స్టోర్ కీపర్(1), ఆఫీస్ సబార్డినేట్(8), మేసెంజర్(2), ల్యాబ్ అసిస్టెంట్(1), ల్యాబ్ అటెండర్(1), వర్క్ షాప్ అటెండర్(1), స్కిల్డ్ వర్క్ మ్యాన్(1), ఫిషర్ మ్యాన్(1), శానిటరీ మేస్త్రీ(1), వాచ్‌మాన్(9), వాటర్ మ్యాన్(1), స్వీపర్(3), పబ్లిక్ హెల్త్ వర్కర్(12), గ్యాంగ్ మజ్దూర్(2), డ్రెయిన్ క్లీనర్(1), కళాసీ(1), హోల్ టైమ్ సర్వెంట్(1), లస్కర్(1) చొప్పున మొత్తం 54 ఖాళీలు ఉన్నాయి. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వెబ్‌సైట్ https://www.gunturap.in/2023.

గోగులమ్మను తాకిన సూర్య కిరణాలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువు తీరిన గోగులమ్మ అమ్మవారిని మంగళవారం సూర్యనారాయణ స్వామి వారి కిరణాలు తాకాయి. ఉదయం 7:13 గంటల నుంచి పావు గంటపాటు ఈ కిరణాలు అమ్మవారిని తాకినట్లు అర్చకులు దీవి గోపాలకృష్ణమాచార్యులు తెలిపారు. ప్రతి ఏటా నాలుగైదు సార్లు సూర్య కిరణాలు అమ్మవారిని ఇలా తాకుతాయని ఆయన పేర్కొన్నారు.

మిర్చి యార్డుకు 1,21,132 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మిర్చి మార్కెట్ యార్డుకు మంగళవారం 1,21,132 బస్తాలు వచ్చాయి. గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,15,421 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 87,722 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.





గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలను ప్రపంచ బ్యాంకు(ఇండియా) డైరెక్టర్ అగస్టే తనో కామే బృందం మంగళవారం సందర్శించింది. విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీతో సమావేశమైంది. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు అద్భుతమని కొనియాడింది. వరల్డ్ బ్యాంకు తగిన విధంగా సాయం అందిస్తుందని హామీ ఇచ్చింది. వీరి వెంట పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఉన్నారు. - పెదకాకాని



విశాఖ వేదికగా ప్రారంభమైన జి-20 సదస్సుకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంగళవారం రాత్రి అక్కడి ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

సమయం లేదు మిత్రమా

- వడ్డీ లేకుండా కడతారా? వడ్డీతో కడతారా ?
- ఇంటి పన్ను చెల్లించేందుకు మిగిలింది మూడురోజులే



చీరాల పురపాలక సంఘ కార్యాలయం

చీరాల: ఇంటి పన్ను బకాయి ఉందా.. బకాయిలు పేరుకుపోయాయా.. మున్సిపాలిటీ వడ్డీతో సహా పన్ను విధించిందా. అయినా గాబరా పడకండి. ప్రభుత్వం పన్ను బకాయిలు వసూలు చేసేందుకు వడ్డీ మినహాయిస్తూ మంచి అవకాశం కల్పించింది. దీన్ని సద్వినియోగం చేసుకుంటే వడ్డీ డబ్బులు మిగిలిపోతాయి. ఈ అవకాశం కూడా కేవలం మూడు రోజులే మిగిలి ఉంది. ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపు కోసం ప్రభుత్వం అందించిన అవకాశంతో పురపాలక సంఘాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు రాయితీతో మేలు జరుగుతుంది. నివాస గృహాలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల పన్నుల బకాయిలు త్వరగా చెల్లించేందుకు మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా నియమించారు. బాపట్ల జిల్లా పరిధిలో అతిపెద్ద పురపాలక సంఘం చీరాల. దీంతోపాటుగా బాపట్ల, రేపల్లె, అద్దంకి మున్సిపాలిటీలు ఉన్నాయి. చీరాల మున్సిపాలిటీకి ఏడాదికి రూ.12.68 కోట్లు పన్నులు వసూలు చేయాలి. ఇప్పటివరకు కేవలం రూ.9.05 కోట్లు వసూలు చేశారు. ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్నులు వసూలు చేసేందుకు ఆటోలు, కరపత్రాలతో ప్రచారం చేస్తున్నారు. ఈనెల 31లోపు నూరుశాతం ఇంటి పన్నులు చెల్లించే వారికి వడ్డీ మినహాయింపు నిచ్చింది. అలానే వివిధ ప్రభుత్వ శాఖలైన తహసీల్దార్ కార్యాలయం, నేతబజారు, డ్రైనేజీ కార్యాలయం, ఇరిగేషన్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్లు, ఉపఖజానా కార్యాలయం, ఆర్‌అండ్ బీ కార్యాలయం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, నేత బజారు తదితర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.1.8 కోట్లు మేరకు పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉండగా ఈ శాఖల ఉన్నతాధికారులకు మున్సిపాలిటీ నుంచి పన్ను నోటీసులు కూడా అందించారు. త్వరగా మున్సిపాలిటీలో పన్నులు చెల్లించాలని కోరుతున్నారు. అద్దంకి మున్సిపాలిటీలో 10509 నివాస గృహాలు, రూ.4.57 కోట్లు పన్ను డిమాండ్ ఉండగా కేవలం రూ.3.81 కోట్లు పన్నులు వసూలు చేశారు. మిగిలిన రూ.90 లక్షలు వసూలు చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. బాపట్ల జిల్లా పరిధిలోని రేపల్లె మున్సిపాలిటీలో 12772 నివాస గృహాలు ఉన్నాయి. వీటికి రూ.3.59 కోట్లు పన్నులు వసూలు చేయాల్సి ఉండగా వసూలు చేసింది మాత్రం రూ.2.57 కోట్లు పన్నులు వసూలు చేశారు.

త్వరగా చెల్లించండి

పురపాలక సంఘాల్లో నివాసం ఉంటే వారు పన్నులు చెల్లించడం కర్తవ్యంగా భావించాలి. పన్నులు ప్రజలు సకాలంలో చెల్లిస్తే అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయగలం. పురపాలక సంఘం అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి. సకాలంలో పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందండి.
– రామచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్, చీరాల

మిగిలింది మూడు రోజులే..

మున్సిపాలిటీలో పన్నులు చెల్లించే వారికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. పన్నులు చెల్లించే వారు వడ్డీ మాఫీ అవకాశం కల్పించడంతోపాటు చెల్లింపులు చేసే వారికి ప్రోత్సాహం కూడా అందిస్తుంది. మార్చి 31లోపు ఇంటి పన్నులు చెల్లిస్తే పుర ప్రజలకు ఆర్థిక మేలు జరుగుతుంది. మున్సిపాలిటీల్లో నివాసం ఉండే వారు మిగిలిన మూడు రోజుల్లో పన్నులు త్వరగా చెల్లించాలని అధికారులు కోరుతున్నారు.



'ఇంటర్'వెల్

గుంటూరుఎడ్యుకేషన్: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు మంగళవారం ముగిశాయి. కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ పేపర్–1 పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 50,053 మంది విద్యార్థుల్లో 48,619 మంది హాజరయ్యారు. డీవీఈఓ జె.పద్మ గుంటూరులోని ఓ పరీక్ష కేంద్రం తనిఖీకి వెళ్లిన సమయంలో కాపీయింగ్‌కు పాల్పడిన ఒక విద్యార్థిని గుర్తించి, మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేయించారు.

ఎంపీహెచ్‌ఏ ఫీమేల్‌కు కౌన్సెలింగ్

గుంటూరుమెడికల్: మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫీమేల్‌కు మంగళవారం గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పునర్విభజన కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 91 మంది హాజరు కాగా, 82మందికి పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్
- ఉత్తమ ఆవిష్కరణలకు బహుమతుల ప్రదానం

ఏఎన్‌యూ: విద్యార్థులు చేసే నూతన ఆవిష్కరణలు, ప్రయోగాలకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన అకడమిక్ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రదర్శనలు చేసిన ఏఎన్‌యూ ఇంజినీరింగ్ విద్యార్థులకు మంగళవారం నగదు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ విద్యార్థుల్లో దాగిఉన్న మేధస్సు, నైపుణ్యాన్ని వెలికితీసి సమాజానికి అందించేందుకు యూనివర్సిటీ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అకడమిక్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ఎంతో ఆలోచనాత్మకమైన నూతన ఆవిష్కరణలు చేశారని తెలిపారు. వారిని మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఉత్తమ ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు, ప్రయోగాలతో ముందుకొస్తే పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. నైపుణ్యం ఉన్న విద్యార్థులను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు వెలుగులోకి తేవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ ప్రసంగిస్తూ అకడమిక్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు తమ నైపుణ్య ప్రదర్శనకు అంకితభావంతో కృషి చేశారన్నారు. విద్యార్థుల నూతన ఆవిష్కరణలు ఇతర విద్యార్థులకు కూడా ఎంతో ప్రేరణను కలిగిస్తాయన్నారు. అకడమిక్ ఎగ్జిబిషన్ కో–ఆర్డినేటర్ ఆచార్య కె.మధుబాబు మాట్లాడుతూ విద్యార్థుల ప్రదర్శనలు సందర్శకులు, బయటి కళాశాలల విద్యార్థులను ఎంతో ఆకట్టుకున్నాయని చెప్పారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సిద్దయ్య మాట్లాడుతూ విద్యార్థులు సమాజాభివృద్ధికి దోహదం చేసే ఎన్నో నూతన ఆవిష్కరణలు చేయడం అభినందనీయమని తెలిపారు. ఓఎస్‌డీ సునీత, పాలకమండలి సభ్యురాలు సరస్వతిరాజు అయ్యర్, ప్రిన్సిపాల్స్ స్వరూపరాణి, గంగాధరరావు, శ్రీనివాస రెడ్డి, ప్రమీలా రాణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ జాన్సన్, ఐఎస్‌సీ డైరెక్టర్ చెన్నారెడ్డి, అడ్మిషన్ల డైరెక్టర్ అనిత ప్రసంగించారు. నూతన ఆవిష్కరణలు చేసిన విద్యార్థులకు వీసీ నగదు బహుమతులు అందజేశారు. పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్

వేసవిలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

వేమూరు: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా పరిష్కారం చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వేమూరు నియోజకవర్గం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి గ్రామాలను గుర్తించి సమస్యలు పరిష్కారం చేయాలని ఆదేశించారు. వేమూరు నియోజకవర్గంలో సైడ్ డ్రెయిన్‌ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిందని, అధికారులు శ్రద్ధ వహించి వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. చుండూరు మండలం ఆలపాడు గ్రామానికి రూ.50 లక్షలు, పెనుద్రపాడు గ్రామానికి రూ.25 లక్షలు, అమర్తలూరు మండలం పాంచాళవరం గ్రామానికి రూ.50 లక్షలు, యలవర్రు గ్రామానికి రూ.50 లక్షలు, పెదపూడి గ్రామానికి రూ.75 లక్షలు, మూల్పూరు గ్రామానికి రూ.50 లక్షలు, బోడపాడు గ్రామానికి రూ.50 లక్షలు, తురుమెళ్లకు రూ.50 లక్షలు, వేమూరు మండలం వరహాపురం గ్రామానికి రూ.50 లక్షలు, వెల్లబాడు గ్రామానికి రూ.25 లక్షలు, పోతుమర్రు గ్రామానికి రూ.50 లక్షలు, పెనుమర్రు గ్రామానికి రూ.25 లక్షలు, కొల్లూరు మండలం దోనేపూడి గ్రామానికి రూ.75 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అధికారులు వెంటనే పనులు ప్రారంభించి, వేసవి కాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బాపట్ల ఎస్ఈ సీహెచ్ విద్యాసాగర్, డీఈ జేబీ సురేష్, ఏఈలు పినపాటి జడ్సన్‌పాల్, లంక జాన్‌ప్రదీప్, రసూల్, ఏసయ్య, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

దేవస్థాన అభివృద్ధికి సహకరిస్తాం

అద్దంకి రూరల్: అద్దంకిలో కాళికామాత సమేత కమతేశ్వరస్వామి దేవస్థాన అభివృద్ధికి దేవదాయ శాఖ తరుపున సహకారం అందిస్తామని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్ కోటిరెడ్డి అన్నారు. దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట జరిగి 40 రోజులు అయిన సందర్భంగా మంగళవారం ప్రత్యేక మండల పూజ, యజ్ఞం నిర్వహించారు. ఈవో కోటిరెడ్డి పూజల్లో పాల్గొని దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. దేవస్థానానికి ఎటువంటి ఆదాయం లేకపోయినా అభివృద్ధి పనులు చేపడుతున్న కమిటీ చైర్మన్ అనంతు మురళీమోహన్‌రావు, అతని మిత్రులను అభినందించారు. ఈఓని దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పొన్నపల్లి బ్రహ్మానందం, చెన్నుపల్లి శ్రీనివాసచారి, పొన్నపల్లి మల్లికార్జున, మునగంటి నరసింహాచారి, వీర సుందరాచారి, బొప్పుడి వీరప్పయాచారి, శర్మ, లక్కరాజు భుజంగరావు, సుబ్బారావు పాల్గొన్నారు.


ఈఓ కోటిరెడ్డిని సన్మానిస్తున్న దేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్, సభ్యులు

చెక్ బౌన్స్ కేసులో టీచర్‌కు ఏడాది జైలు శిక్ష

సత్తెనపల్లి: చెక్ బౌన్స్ కేసులో ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుడికి ఏడాది జైలు శిక్ష, రూ.4 లక్షలు నష్టపరిహారం చెల్లించాల్సిందిగా సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి చెందిన కూరాకుల పున్నయ్య వద్ద 2015 అక్టోబర్ 10న కుటుంబ అవసరాల నిమిత్తం నూజెండ్ల మండలం రవ్వవరం ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పమిడిమళ్ల ఏసుబాబు రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. పున్నయ్య తిరిగి నగదు ఇవ్వాలని కోరగా, దీని నిమిత్తం 2017 జనవరి 27న రూ.4 లక్షలకు ఏసుబాబు చెక్ ఇచ్చాడు. ఆ చెక్కును కూరాకుల పున్నయ్య తన బ్యాంకు ఖాతాలో వేయగా ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయ్యింది. నేరం రుజువు కావడంతో ఎన్ఐ యాక్ట్ కింద న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

అట్రాసిటీ కేసుల విచారణ వేగవంతం చేయాలి

- ఎస్పీ వకుల్‌జిందాల్
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమీక్ష

బాపట్లటౌన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణపై డీఎస్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత అట్రాసిటీ ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం నమోదైన కేసుల వివరాలు, వాటి పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసు ఫైల్స్‌ను స్వయంగా పరిశీలించి సదరు కేసుల్లో దర్యాప్తు, నిందితుల అరెస్ట్, ఛార్జిషీటు దాఖలు తదితర విషయాల్లో తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదులు అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టాలన్నారు. కేసుల విచారణ సమయంలో బాధితులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ త్వరితగతిన విచారణ పూర్తి చేసి, నిర్దేశిత కాలవ్యవధిలో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. సమర్థమైన ట్రయల్ ద్వారా నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు, దర్యాప్తులో అలసత్వం వహించరాదని, అలసత్వం వహించిన పోలీస్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో బాపట్ల డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఎ.వి.రమణ, డీసీఆర్‌బీ సీఐ పి.బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

జిల్లాను గంజాయి రహితంగా మార్చాలి

గంజాయి, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా బాపట్లను మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జిల్లాలోని పోలీస్ సిబ్బందితో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో 2023వ సంవత్సరంలో మొత్తం 20 కేసుల్లో సుమారు 637.176 కేజీల గంజాయిని సీజ్ చేసి 70 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి ద్వారా గంజాయి సరఫరా చేసే, విక్రయించే ముఠాలను అదుపులోకి తీసుకున్న మార్టూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్.టి.ఫిరోజ్, మార్టూరు ఎస్ఐ కమలాకర్‌లను అభినందించారు. దాడులు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయన్నారు. గంజాయి కేసులలో నిందితులపై షీట్స్ తెరవాలని అధికారులను ఆదేశించారు. నేరస్తుల ప్రవర్తనలో మార్పురాకుంటే వారిపై పీడీ చట్టం ప్రయోగిస్తామన్నారు. సమావేశంలో రేపల్లె, చీరాల, బాపట్ల డీఎస్పీలు టి.మురళీకృష్ణ, పి.శ్రీకాంత్, ఎ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బి సీఐ బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

మేదరమెట్ల జెడ్పీ విద్యార్థుల ప్రతిభ


అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

మేదరమెట్ల: విజయవాడలో మంగళవారం నిర్వహించిన ఈఎండీపీ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో మేదరమెట్ల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరిలో సాయి, చరణ్‌తేజ, సాయితేజ ఉన్నారు. పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థులకు ఏపీ ఈఎండీపీ ఎండీ నెక్రిన్ మిద్లాజ్ విన్నింగ్ అవార్డు, అమెజాన్ గిఫ్ట్ ఓచర్లను అందజేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను హెచ్ఎం అంజయ్య, సైన్స్ ఉపాధ్యాయుడు పోతురాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన జాతీయస్థాయి పశు బలప్రదర్శన పోటీలు

అచ్చంపేట: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా వేల్పూరులో జరుగుతున్న జాతీయ స్థాయి పశు బలప్రదర్శన బండలాగుడు పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. వట్టికుంట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో కృష్ణా జిల్లా, కానూరు మండలం, పెనమలూరుకు చెందిన దేవభక్తుని సుబ్బారావు ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానాన్ని గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లికి చెందిన పులగం జ్యోతిరెడ్డి ఎడ్ల జతకు, మూడవ స్థానం గుంటూరు జిల్లా, చుండూరు మండలం, వేటపాలానికి చెందిన ఆర్కే బుల్స్, 4వ స్థానం పిడుగురాళ్ల మండలం, బ్రాహ్మణపల్లికి చెందిన దుప్పిలి అంజిరెడ్డి జతకు, 5వ బహుమతి బాపట్ల మండలం, బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి జతకు, 6వ బహుమతి గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన అవుతు అర్ధవర్ధన్‌రెడ్డి జతకు, 7వ బహుమతి బాపట్ల మండలం బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి జతకు, 8వ బహుమతి పల్నాడు జిల్లా మాచవరానికి చెందిన ముక్కపాటి రామారావుచౌదరి జతకు, 9వ బహుమతి బాపట్ల మండలం బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్ల జతకు లభించాయి. పోటీలో మొత్తం 15 జతలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చీరాల వాడరేవు హైవేపై రైతుల అభ్యంతరాల స్వీకరణ

రైతులతో సమావేశం నిర్వహించిన జిల్లా జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: చీరాల వాడరేవు హైవేపై రైతుల అభిప్రాయం తీసుకునేందుకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన రెవెన్యూ, హైవే అధికారులు సమావేశం నిర్వహించారు. హైవే కోసం చేసిన నోటిఫికేషన్‌పై రైతుల అభ్యంతరాలను స్వీకరించేందుకు సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన కేసానుపల్లి, ఇసప్పాలెం, జొన్నలగడ్డ, గుంటగార్లపాడు, రావిపాడు గ్రామాలకు చెందిన రైతుల నుంచి అభ్యంతరాలను నమోదు చేశారు. వీటిని పై అధికారులకు పంపిస్తామని తెలిపారు. హాజరైన రైతులు అధికారుల ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. గతేడాది తొమ్మిదో నెలలోనే తామందరమూ అభ్యంతరాలు తెలియచేయగా ఇప్పటివరకు వాటికి సమాధానాలు ఇవ్వలేదన్నారు. దీంతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే, హైవే అధికారులతో సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు సమావేశం నిర్వహించలేదన్నారు. దీనిపై నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పురపాలక పరిధిలోని భూముల్లో గుండా కాకుండా మండల పరిధిలోని పొలాలను రహదారి నిర్మాణంకోసం ఇచ్చేందుకు తమకు అభ్యంతరంలేదన్నారు. ప్రస్తుతం పురపాలక పరిధిలో విపరీతంగా భూముల రేట్లు పెరిగినందున అవి తీసుకొని ప్రభుత్వం ఇస్తానంటున్న ధరలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. అందువలన తామంతా తమ భూములను ఇచ్చేందుకు వ్యతిరేకిస్తున్నామని అధికారులకు తెలియచేప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, తహసీల్దార్ ఆర్‌వీ రమణా నాయక్ సమావేశానికి హాజరుకాగా రైతు సంఘ నాయకులు ఏపూరి గోపాలరావు, కామినేని రామారావు, పీడీఎం నాయకుడు నల్లపాటి రామారావు రైతులకు మద్దతు పలికారు.



కార్యాలయం బయట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

యువకుడు అనుమానాస్పద మృతి

బల్లికురవ: మద్యం మత్తు, ఎండతాపానికి గురై రోడ్డు మార్జిన్‌లోనే పడిపోయి యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం మండలంలోని కొత్తమల్లాయపాలెం గ్రామ సమీపంలో జరిగింది. ఎస్సై వీ వేమన తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణ (35) ఇక్కడ క్వారీల్లో పనిచేస్తున్నాడు. సంతమాగులూరుకు చెందిన కాంట్రాక్టర్ సత్యం ద్వారా వచ్చాడు. మద్యానికి బానిస కావడంతో ఏ క్వారీలోనూ సక్రమంగా పనిచేయలేకపోయాడు. దీంతో క్వారీల నిర్వాహకులు పనిలో పెట్టుకోలేదు. ఈ క్రమంలో కొత్తమల్లాయపాలెం నుంచి క్వారీలకు వెళ్లే రోడ్డులోని మార్జిన్‌లో పూటుగా మద్యం సేవించి పడిపోయి ఉండటంతో స్థానికులు ఎస్ఐకి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి వచ్చి ఎస్ఐ పరిశీలించగా అతను మృతి చెందినట్లు తెలుసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


మృతుడు లక్ష్మీనారాయణ

భర్త ఇంటిముందు భార్య ఆందోళన

చీరాల: తన భర్త తనకు కావాలి.. న్యాయం చేయాలంటూ వివాహిత భర్త ఇంటిముందు ఆందోళనకు దిగింది. ఈఘటన మంగళవారం రాత్రి పట్టణంలోని హారీస్‌పేటలో చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. హారీస్‌పేటకు చెందిన లేళ్ల చైతన్యకు రాజ్యలక్ష్మితో కొంతకాలం కిందట వివాహం జరిగింది. అయితే గత కొన్ని రోజుల నుంచి తన భర్త చైతన్య తనను వేధించడంతోపాటు అత్తమామల మాటలకు ఒత్తాసు పలుకుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయింది. అత్తమామల ఆదేశాలతో భర్త తనను ఇంట్లోకి రానివ్వకుండా వేధిస్తుండటంతో గత్యంతరం లేక తన భర్త ఇంటి ముందు ఆందోళన చేస్తున్నానని తెలిపింది. తనకు న్యాయం చేసేంత వరకు ఆందోళన విరమించనని ఇంటి ముందు భీష్మించుకుని కూర్చుంది. సమాచారం అందుకున్న ఒన్‌టౌన్ పోలీసులు ఆందోళన చేస్తున్న వివాహిత, ఇరువర్గాల కుటుంబ సభ్యులతో సంప్రదింపులు చేస్తున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.


ఇంటి ముందు నేలపై కూర్చొని ఆందోళన చేస్తున్న రాజ్యలక్ష్మి

భర్త దాడిలో భార్య మృతి

దుర్గి: మించాలపాడు గ్రామంలో భార్యాభర్తల మధ్య వివాదంలో భార్య మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన ఎర్రగోల వెంకటరావమ్మ (50) మృతి చెందింది. భర్త హనుమయ్య మృతురాలు వెంకటరావమ్మ మధ్య ఘర్షణ జరిగింది. క్షణికావేశంలో హనుమయ్య గాయపరచడంతో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. వీరికి ఐదుగురు సంతానం. కుమారులు అందరూ వివాహాలు చేసుకుని ఎవరికి వారే విడివిడిగా జీవిస్తున్నారు. మృతురాలి స్వస్థలం గురజాల మండలం అంబాపురం. కుటుంబ సభ్యులు, మృతురాలి తమ్ముడు జిలుగు వీరయ్య స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాలికుంటు టీకాతో పశువులకు రక్షణ

జిల్లా పశుసంవర్థక అధికారి హనుమంతరావు

వేటపాలెం: ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా ఉచితంగా అందిస్తున్న గాలికుంటు టీకా పశువులకు రక్షణగా ఉంటుందని బాపట్ల జిల్లా పశుసంవర్థక శాఖాధికారి ఎం హనుమంతరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన గాలికుంటు టీకా పంపిణీ శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో వ్యాక్సిన్ ఏప్రిల్ 24వ తేదీ వరకు పంపిణీ చేస్తారని తెలిపారు. రైతులు, పశుపోషకులు టీకాను తమ పశువులకు వేయించి వ్యాధి బారిన పడకుండా కాపాడాలని సూచించారు. కొత్తరెడ్డిపాలెం గ్రామంలో 62 గేదెలు, 28 లేగ దూడలు, నాలుగు ఆవులకు టీకా వేశామని తెలిపారు. కార్యక్రమంలో సజ్జా చిట్టిబాబు, డాక్టర్ దేవలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


టీకా వేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ హనుమంతరావు

ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

మత్స్యశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులు శిక్షణ తరగతులు

నిజాంపట్నం: మత్స్యకార సొసైటీ మహిళలు మత్స్య ఉత్పత్తుల ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చని మత్స్యశాఖ జేడీ పి సురేష్ అన్నారు. నిజాంపటప్నంలో చేపలు, రొయ్యల విలువ ఆధారిత ఉత్పత్తులపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ(యూఎన్‌డీపీ), గ్రీన్ క్లైమెట్ ఫండ్ (జీసీఎఫ్)సంయుక్తంగా ఆర్థిక నిధులతో తీరప్రాంత మత్స్య పర్యావరణ సంసిద్ధతను పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్స్యశాఖ జేడీ సురేష్ మాట్లాడారు. తీర ప్రాంతంలోని మత్స్య పర్యావరణ సంసిద్ధతను పెంపొందించుటకు, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన ద్వారా జీవనోపాధిని పెంపొందించడానికి ఈ శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.

మత్స్యకార సొసైటీలకు చెందిన మహిళలు ఈ శిక్షణలో అనేక విషయాలు తెలుసుకుని మత్స్య ఉత్పత్తులపై చేపలు, రొయ్యలను ఎండబెట్టి వాటిద్వారా వ్యాపారాలు చేసుకుని మరింత ఆర్థికంగా ఎదగాలని సూచించారు. చేపలు, రొయ్యలు ఎండబెట్టడం వంటి వ్యాపార అంశాలను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ గాలిదేముడు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి షేక్ కౌసర్, మార్కండేయులు, సర్పంచ్ కొక్కిలిగడ్డ రవి, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.


మత్స్య ఉత్పత్తులను పరిశీలిస్తున్న మత్స్యశాఖ జేడీ సురేష్

పాడిరైతుల సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల టౌన్: అన్నదాతలతోపాటు పాడిరైతులు ఆర్థికంగా వృద్ధి చెందేలా సంక్షేమ పథకాలను అందించి పశువుల సంపూర్ణ ఆరోగ్యానికి భద్రత కల్పిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. మంగళవారం మండలంలోని ఈపూరుపాలెం పశువైద్యశాలలో జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశువైద్యురాలు పావని ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీతో పాటుగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, చీరాల ఏడీ డాక్టర్ చిట్టిబాబు హాజరయ్యారు. సునీత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశువుల సంరక్షణ కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, పశువులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు 1962 సంచార వైద్యశాల, రాయితీపై పథకాలు అందిస్తుందన్నారు. పాడి పశువులకు సీజనల్ వ్యాధులకు గురికాకుండా టీకాలు, పోషకాహారాన్ని అందిస్తుందన్నారు. అనంతరం గాలికుంటు టీకాలను పాడిపశువులకు పశువైద్యులు వేశారు. ఏప్రిల్ 24 తేదీ వరకు జరిగే టీకాల పంపిణీలో పశుపోషకులు విధిగా తమ పశువులు, గేదెలకు గాలికుంటు రాకుండా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌పీలు, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.


టీకాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సునీత, జిల్లా ఏడీ హనుమంతరావు

విద్య, ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

స్టెప్ సీఈఓ పల్లవి

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల స్థాయి నుంచి విద్య, ఆరోగ్యంపై అవగాహన కలిగిఉండాలని స్టెప్ సీఈఓ ఎస్.పల్లవి తెలిపారు. బరంపేటలోని కాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఈఓ పల్లవి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా గుర్తించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. చదువుతోపాటు ఆటల పట్ల కూడా మక్కువ పెంచుకోవాలని తెలిపారు. విద్య, లలిత కళలు, క్రీడల్లో రాణించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.ఇశ్రాయేల్‌ప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.తావుర్యా, ఎడ్యుకేట్ ద సొసైటీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అన్సారీ, స్టెప్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న స్టెప్ సీఈఓ పల్లవి తదితరులు